క్లుప్తంగా

పాలకొల్లులో ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్

పోడూరు: యునైటెడ్ కాపు వనిత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణంలోని న్యూబ్యాంక్ కాలనీ ఎస్ఎస్ఎన్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రి వైద్యులతో పాటు పట్టణంలోని ప్రముఖ వైద్యులు శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ మంగిన అరుణ, ప్రెసిడెంట్ యామన విజయలక్ష్మి, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ సిద్దిరెడ్డి శైలజ, విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళి తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు ఉల్లాస్ అక్షరాస్యత పరీక్ష



పోడూరులో ఉల్లాస్ పరీక్ష రాస్తున్న వయోజనులు

పోడూరు: వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమం ద్వారా శిక్షణ తీసుకున్న వయోజనులకు ఆదివారం పరీక్ష నిర్వహించినట్లు స్థానిక ఐకేపీ ఏపీఎం ఎం.సుభాషిణి తెలిపారు. మండల వ్యాప్తంగా 15 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 200 మంది వయోజనులు హాజరైనట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది వయోజనులకు పరీక్ష నిర్వహించారు.

పర్యాటక కేంద్రాల సందర్శన



అల్లూరి విగ్రహం వద్ద స్కౌట్ గైడ్స్ శిక్షణ విద్యార్థులు

భీమవరం: క్రమశిక్షణ, ఏకాగ్రత దేశభక్తికి స్కౌట్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ దోహదపడతాయని, జాతీయ భావాలను పెంపొందిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్కౌట్ గైడ్స్ శిక్షణ ఎల్‌టీసి (అమరావతి) డీఎల్ నారాయణ అన్నారు. గత రోజులుగా భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో 192 మందికి స్కౌట్ గైడ్స్‌పై శిక్షణా శిబిరాన్ని నిర్వహించగా ఆదివారం పర్యాటక కేంద్రాలను సందర్శించారు. దీనిలో భాగంగా 125 అడుగుల విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం, పెదఅమిరం జైన్ దేవాలయాలను సందర్శించారు. నారాయణ మాట్లాడుతూ స్కౌట్ బాల్యం నుంచి శిక్షణ పొందితే జీవిత గమనంలో ప్రతిభ పాటవాల్లో ముందుంటారని, దేశ వ్యాప్తంగా వేలాది పాఠశాలలో స్కౌట్ గైడ్స్ శిక్షణ పొంది సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నేను కూడా పాఠశాల విద్యార్థిగా స్కౌట్ గైడ్స్ శిక్షణ పొందానని, స్కౌట్‌తో సమన్వయ శాంతి స్వభావాలు కలుగుతాయన్నారు.

లిఫ్టు నిర్మాణం వేగవంతం చేయాలి



అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ నిర్మాణం

ఆకివీడు: భీమవరం–నిడదవోలు బ్రాంచి రైల్వే లైన్లలో పలు స్టేషన్లలో నిర్మాణం చేపట్టిన లిఫ్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లుగా లిఫ్టుల నిర్మాణ పనులు అన్ని స్టేషన్లలో ఇదే తంతులో ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ లిఫ్టు నిర్మాణాలపై రైల్వే ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఏళ్ల తరబడి నిర్మించేటట్టుగా ఉందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. బ్రాంచి రైల్వే లైన్ డబల్ లైన్, విద్యుద్ధీకరణ చేపట్టడంతో పలు స్టేషన్లలో ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. ఒకటి, రెండు ప్లాట్ ఫాంలకు వెళ్లాలంటే తప్పనిసరిగా వంతెన ఎక్కి వెళ్లాల్సిందే. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు వంతెనలు ఎక్కి, దిగలేక అవస్థలు పడుతున్నారు. వంతెనల బెడదను తొలగించేందుకు రైల్వే శాఖ అధికారులు అన్ని స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. రెండేళ్లుగా పలు స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణం మందకొడిగా సాగుతుంది. పునాదుల, పిల్లర్లు, శ్లాబ్‌ల దశలోనే ఆగిపోయాయి. ఎప్పుడు లిఫ్టులు అమర్చుతారని ప్రయాణికులు ఎదురు చేస్తున్నారు. లిఫ్టు సాకర్యాన్ని వేగవంతం చేసేందుకు ఈ ప్రాంతంలోని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

వలంధర్‌రేవులో వసతులు నిల్

- కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు
- పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు



బురదతో అధ్వానంగా ఉన్న నరసాపురం వశిష్ట వలంధర్ రేవు

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే వశిష్ట గోదావరి వలంధర్‌రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో గోదావరి వలంధర్ రేవు ప్రధానమైంది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూరప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. కానీ రేవులో కనీస వసతులు మాత్రం లేవని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు వలంధర్‌రేవు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రేవును శుభ్రత ఎలాంటి చర్యలు తీసుకోవడంతో దీంతో రేవు నిండా బురద పేరుకుపోతుంది. అందువల్ల స్నానాలకు దిగిన భక్తులు రేవులో కాలు జారి పడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదానికి గురి కావాల్సి వస్తోందోనని భక్తులు భయాందోళన చెందుతున్నారు. రేవులో అస్తికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రేవులో 6 అడుగులు దూరం దాటి వెళితే చాలా లోతు ఉంటుంది. కానీ ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు కనిపించవు.

గతంలో అనేక ప్రమాదాలు..

గతంలో అనేక మంది రేవులో గల్లంతైన సంఘటనలు జరిగాయి. 2012లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇలానే రేవులో కాలుజారి పడి ప్రాణాలు పోగొట్టుకుంది. అప్పటిలో విమర్శలు రావడంతో మునిసిపల్ అధికారులు స్పందించారు. రేవులో రక్షణగా సిమెంట్ స్తంభాలు పాతి, కంచె ఏర్పాటు చేశారు. తరువాత 2015 పుష్కరాల సమయంలో రేవులో కొద్దిపాటి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం ఆ కంచె శిథిలమైంది. దీంతో రేవులో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ ఉంది. సముద్రపు పోటు స్థానికంగా రేవులో నీరు ఎక్కువగా ఉంటుంది. పోటు సమయంలో రేవులో నీరు లేకపోతే అక్కడి అధ్వాన్న పరిస్థితులు పైకి పూర్తిగా కనిపిస్తాయి. ముఖ్యంగా రేవులో తాగునీటికి సంబంధించి ఓ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో గతంలో మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు కానీ కుళాయి మాత్రం ఏర్పాటు చేయలేదు. కనీసం రేవు వద్ద తాగడానికి మంచినీళ్లు కూడా అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వలంధర్‌రేవులో కనీస సౌకర్యాలకు మెరుగుపర్చాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



వలంధర్‌రేవులో వసతులపై దృష్టి పెడతాం. గతంతో పోలిస్తే చాలా వరకూ పరిస్థితిని మెరుగుపరిచాం. ఉదయం పూట పారిశుద్ధ్య కార్మికులను అందుబాటులో ఉంచుతున్నాం. షవర్‌బాత్ కూడా మామూలు రోజుల్లో కూడా అందుబాటులో ఉంచుతున్నాం. రేవు మరమ్మతుల అంశంపై దృష్టి పెడతాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు గడువు పెంపు

నరసాపురం: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరు చేసే స్వయం ఉపాధి రుణాల కోసం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువును ఈ నెల 25 వరకు ప్రభుత్వం పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలు వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అర్హత వయో పరిమితిని 50 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచారని, ఈ అంశాన్ని గమనించాలని సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును తిరస్కరించాలి



యలమంచిలిలో మాట్లాడుతున్న నల్లి రాజేష్

యలమంచిలి: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును తిరస్కరించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. యలమంచిలిలో ఆదివారం మాల మహానాడు సమావేశం రాష్ట్ర కార్యదర్శి మోక నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముందుగా బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అన్నదమ్ములుగా ఉన్న మాల మాదిగలను విడదీసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. ఇదే విధంగా కొనసాగితే రెండు ప్రభుత్వాలకు మాలలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సరిళ్ళ శ్రీనివాసు, జిల్లా కార్యదర్శులు నల్లి జయరాజు, మర్రి సామ్యూలు, డివిజన్ ఉపాధ్యక్షుడు మట్ట చంద్రశేఖర్, డివిజన్ కార్యదర్శి మానుకొండ శివరావు, యలమంచిలి మండల ఉపాధ్యక్షుడు కలిగితి శ్రీను, గడ్డం శంకర్, నాయకులు రొక్కాల విజయ్ గాంధీ, పాలపర్తి ఇమ్మానియేలు, మానుకొండ సోమరాజు, కప్పల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న దళితసంఘాల నాయకులు

నరసాపురం: అంబేడ్కర్‌ను అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఘటనపై నరసాపురం దళిత సంఘాలు మండిపడ్డాయి. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో 216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ దళితసంఘాల నాయకులు ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి ఆనంద్(మధు) మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిదల శరత్, నేల రవికుమార్, జేవీఆర్, నేతల రాజు, చిలకపాటి జోసఫ్, గోగులమండ చంద్రశేఖర్, తణుకుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సిద్ధాంతంలో మధ్యస్థ లంకలో పూర్వ విద్యార్థులు

పెనుగొండ: ఏనాడో పెనవేసుకున్న బంధాన్ని మరోసారి తమ కుటుంబసభ్యుల మధ్య జ్ఞప్తికి తెచ్చుకుంటూ పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1986–87 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు వశిష్ట గోదావరి సిద్ధాంతం మధ్యస్థ లంకలో ఆదివారం అపూర్వసమ్మేళనం నిర్వహించారు. కేదారీఘాట్ నుంచి పూర్వవిద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలసి పడవలపై మధ్యస్థ లంకకు చేరుకున్నారు. అనంతం వారి వారి సంతానం సాధించిన విజయాన్ని, వారు చేస్తున్న ఉద్యోగాలను ఒకరికిఒకరు చెప్పుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా సీతారామ్



సీతారామ్‌ను అభినందిస్తున్న మాల సంఘాల నాయకులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా సుంకర సీతారామ్‌ను నియమించినట్లు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చికటమిల్లి మంగరాజు, రాష్ట్ర జేఏసీ కన్వీనరు గుమ్మాపు సూర్య వరప్రసాద్‌లు ఆదివారం ప్రకటించారు. నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా బీరా మధు, నియోజకవర్గ కన్వీనరుగా మట్టా రాము, ఆచంట జేఏసీ చైర్మన్‌గా కోట వెంకటేశ్వరరావు, ఆచంట మండల కన్వీనరుగా పీతల అంబేడ్కర్, పెనుగొండ జేఏసీ చైర్మన్‌గా కొనుకు శ్రీనివాసరావు(జెంట్రీ), కన్వీనరుగా పులిదిండి వెంకటేశ్వరరావు, పెనుమంట్ర జేఏసీ చైర్మన్‌గా ఈది ప్రవీణ్, కన్వీనరుగా ప్రసన్నకుమార్, పోడూరు మండల జేఏసీ చైర్మన్‌గా పోతుమూడి రామచంద్రరావు, కన్వీనరుగా బూడిత భీమరావు తదితరులను ప్రకటించారు. ఎస్సీ వర్గీకరకణకు వ్యతిరేకంగా కార్యచరణ రూపొందించి పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

26న నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 26న, బుధవారం ఉదయం 12 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఏప్రిల్ నుంచి ధాన్యం కొనుగోళ్లు

తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దాళ్వాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వాట్సప్ యాప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు వారు ఎప్పుడు కోస్తారో ఎప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తారన్నది యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



నరసాపురం: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: సీపిఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని జరుపుతున్న దృశ్యం

నరసాపురం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మీరా భవన్ వద్ద నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టడానికి ప్రాణత్యాగం చేశారని వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ, మంచిలి నీలకంఠం, కోడి లక్ష్మణ్, వాసా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో...

నరసాపురం రూరల్: నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శంగా నిలుస్తారని సీపీఐ మండల కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపిఐ స్తూపం వద్ద పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో సరిపల్లి గ్రామ సీపీఐ నాయకులు యనమదుర్తి నాగేశ్వరరావు, సిర్రా రవి, మల్లవరం కార్యదర్శి దిడ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఐక్యంగా ఉద్యమించాలి

పెనుగొండ: మతోన్మాదం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం భారత స్వాతంత్ర పోరాట అమరవీరులు భగత్ సింగ్, సుఖదేవ్ రాజ్ గురుల 94వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ బాలల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సంతమార్కెట్‌నుంచి కచేరీ సెంటర్ వరకూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ మండల కార్యదర్శి కుసుమే జయరాజు, ప్రజా సంఘాల నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం



పెనుగొండలోని శ్రీరామ జప యజ్ఞంలో ప్రవచనాలు చెబుతున్న కమలానంద భారతి స్వామీజీ

పెనుగొండ: శ్రీరాముని జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. ఆదివారం హైందవి సంస్థ ఆధ్వర్యంలో పెనుగొండలోని శ్రీ లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మండపంలో జరిగిన శ్రీరామ జపయజ్ఞంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మండపారాధన, హోమాలు నిర్వహించారు. రాముడు ఒక కుమారుడిగా, అన్నగా, భర్తగా, స్నేహితుడుగా ఎలా జీవించాలో సమాజానికి తెలియజెప్పారన్నారు. గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతులు పరమ హంస పరివ్రాజకాచార్య కమలానంద భారత స్వామీజీ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన హిందువుగా జీవించాలన్నారు. వికృత పోకడలకు దూరంగా ఉండాలని, కుటుంబ సమేతంగా దేవాలయనాకి వెళ్లి అలవాటు పెంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సుమారు 2వేల మంది పాల్గొని సామూహిక విష్ణు సహ్ర నామ పారాయణ చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

గుర్రపుడెక్కతో నీటి ప్రవాహానికి ఆటంకం



గేదెలకోడులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఆకివీడు: పంట, మురుగు కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. పలు కాలువలో నీటి ప్రవాహానికి తీవ్ర అవరోధం కలిగిస్తున్నాయి. గుర్రపుడెక్కతో పాటు తూడు పేరుకుపోయింది. వెంకయ్య వయ్యేరు, ఓల్డ్ వయ్యేరు పంట కాలువలతో పాటు మైనర్, మీడియం పంట కాలువల్లో గుర్రపుడెక్క కిక్కిరిపోయింది. మండలంలోని చిన కాపవరం డ్రెయిన్‌తో పాటు పలు మైనర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. గుమ్ములూరు వద్ద చినకాపవరం డ్రెయిన్‌లో ఏళ్ల తరబడి తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పచ్చగడ్డి మొలుస్తోంది. పచ్చగడ్డిని రైతులు కోసుకుంటున్నారు. దీనిపై పశువులు నడుస్తూ గడ్డి తింటున్నాయంటే, ఇక్కడ ఏ మేరకు మేట వేసి ఉందో స్పష్టమవుతోంది. వేసవిలో మెయింటినెన్స్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆ మలుపులు ప్రమాదాలకు పిలుపులు



గుమ్ములూరులో శివారులో బండారుచెరువు వద్ద ప్రమాదకరమైన మలుపు



పెనుమదం శివారు ఎస్ఆర్ఆర్‌పేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

పోడూరు: మండలపరిధిలో పలు ప్రధాన రహదారి మార్గాల్లో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. పాలకొల్లు–ఆచంట స్టేట్ హైవే వాహనాల రాకపోకలతో నిత్యం ఎంతో రద్దీగా ఉంటుంది. గుమ్ములూరు, పెనుమదం గ్రామాల పరిధిలో పలుచోట్ల ఈ మార్గంలో ఉన్న మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని మలుపుల వద్ద మలుపును సూచిస్తూ వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా సూచిక బోర్డులను ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేశారు. మరికొన్ని మలుపుల వద్ద ఇలాంటి బోర్డులు కూడా లేవు. కొన్నిచోట్ల రహదారి మలుపుల వద్ద రోడ్డుమార్జిన్‌లో పొదలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి మలుపులు సరిగా కనిపించకుండా ఇబ్బందికరంగా ఉంటున్నాయిన వాహనాదారులు వాపోతున్నారు. అలాంటి ప్రదేశాల్లో దట్టంగా పెరిగిన పొదలు, పిచ్చిమొక్కలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మలుపుల వద్ద ప్రమాదాలు జరుగకుండా ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రైవర్లు వాహనాలు నెమ్మదిగా నడపాలి



మలుపుల వద్ద లారీలు, బస్సులు, కార్లు ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నెమ్మదిగా వెళ్లాలి. అధికవేగంతో వెళ్లడం వల్ల మలుపుల వద్ద వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు మలుపుల వద్ద అప్రమత్తంగా వెళ్లాలి.

– మల్లుల గణపతి, పోడూరు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి



ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న మలుపుల వద్ద వాహనదారులను అప్రమత్తంచేస్తూ 'ప్రమాదాలు జరిగే ప్రదేశం' 'వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని' హెచ్చరిక బోర్డులు పెట్టాలి. బోర్డులు ఉండడం వల్ల వాహనాలు నడిపేవారు అప్రమత్తమవుతారు.

– పొలమూరి రాజమోహన్, వేడంగి

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేద్దాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉండి: ప్లాస్టిక్ నిర్మూలనకు ఐకమత్యంగా ముందుకు రావాలని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా కిరణ్ ప్రసాద్ అన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ లేని నాటి సమాజం ఎంతో ఆరోగ్యంగా ఉండేదని అన్నారు. కానీ ఎప్పుడైతే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం ప్రారంభించినప్పటి నుంచి భయంకరమైన రోగాలు రావడం ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఉండిని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనేదే తమ ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ప్రతి ఆదివారం రెండు గంటల పాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని అందరినీ ఏకం చేసి ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే దుకాణదారులు ప్రజలకు సహకరించాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కిరణ్‌ప్రసాద్ కోరారు.

30న మహా చండీహోమం

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని కనక దుర్గమ్మ ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీన మహాచండీ, దుర్గా సహిత రుద్రహోమం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి వార్షికోత్సవాల్లో 29వ తేదీన అమ్మవారికి మహిళలు బిందెలతో తీసుకొచ్చిన పసుపు నీళ్లతో జలాభిషేకం, 30న మహాచండీ, రుద్ర హోమం, 31వ తేదీన కుంకుమ పూజలు, అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమాలను రోజూ ప్రత్యేక పూజలను బ్రహ్మశ్రీ గూడూరి రామభద్ర శివ కుమార్‌శర్మ (నాని) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.